నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
13 | హైదరాబాద్, మంగళవారం 27 ఫిబ్రవరి 2024 | SANGAREDDY

పెరిగిన 'మల్లన్న' ప్రసాదం ధరలు

కొమురవెల్లి మల్లన్న లడ్డూలు

చేర్యాల, ఫిబ్రవరి 26 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామి లడ్డూ ప్రసాదం ధరలు పెంచుతూ ఇటీవల ఆలయవర్గాలు నిర్ణయం తీసుకున్నాయి. మల్లన్న ఆలయంలో గతంలో 100 గ్రాముల లడ్డూ రూ.20 రూపాయలకు భక్తులకు విక్రయించేవారు. తాజాగా ఆలయవర్గాలు పెంచిన ధర ప్రకారం 100 గ్రాముల లడ్డూ రూ.25గా నిర్ణయించారు.నూతనంగా అభిషేకం లడ్డూల విక్రయాన్ని ప్రవేశపెట్టారు. ఇక నుంచి భక్తులకు 400 గ్రాముల అభిషేకం లడ్డూ ధర రూ.100కు విక్రయించనున్నారు. దేవాదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలయంలో పెరిగిన ధరలను ఈ నెల 23వ తేదీ నుంచి అమలులోకి తీసుకొచ్చారు. పెరిగిన సరుకుల ధరలతో పాటు దేవాలయానికి ఆదాయం సమకూర్చేందుకు లడ్డూ ప్రసాదం ధరలు పెంచినట్లు ఆలయవర్గాలు తెలిపాయి.

బాలికల విద్యతోనే సమాజాభివృద్ధి

జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య

సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు, ఎంపీ కృష్ణయ్య

రాయికోడ్, ఫిబ్రవరి 26: ప్రతిఒక్కరూ పిల్లలను చదివిస్తేనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు (ఎంపీ) ఆర్ కృష్ణయ్య అన్నారు. సోమవారం మండల పరిధి అల్లాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న బీరప్పస్వామి దేవాలయం ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు. గ్రామ కురుమ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది పెద్దగొల్ల జగన్నాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని గొల్లకురుమలు విద్య, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉన్నత చదువులు చదువుకునే పిల్లలకు తన వంతుగా సాయం చేస్తానన్నారు. సమావేశంలో కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్, రాష్ట్ర కురుమ సంఘం నాయకులు పైతర సాయికుమార్, తెలంగాణ గొర్రె,మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాపు మలిశెట్టి, వరం వైస్‌చైర్మన్ తుకారాం, మండల కురుమ సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా కురుమ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కిష్టయ్య, ఎంపీటీసీ శంకరమ్మ, మాజీ సర్పంచ్‌లు నాగార్జున, ప్రవీణ్‌కుమార్, నర్సుమ్మ, మండల కురుమ యువజన సంఘం నాయకులు సింగితం రాజు, సంతోశ్, అగమయ్య, పాండు, గ్రామ కురుమ సంఘం నాయకులు పోతుల రాజు, అనిల్, తుకారం, తులసీదాస్‌లు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసేందుకే

బీజేపీ ప్రజాహిత యాత్రలు

హుస్నాబాద్ మార్కెట్ యార్డులో సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బండి సంజయ్ చేసిందేమిటో చెప్పాలి

హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలను ఓటు అడిగే హక్కు బండి సంజయ్‌కి లేదు

రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

హుస్నాబాద్, ఫిబ్రవరి 26: రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసేందుకే బీజేపీ ప్రజాహిత యాత్రలు చేపట్టిందని రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని మహ్మదాపూర్ రోడ్డులో హుస్నాబాద్ నుంచి మహ్మదాపూర్ వరకు నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన, వ్యవసాయ మార్కెట్ యార్డులో పొద్దు తిరుగుడు పంట కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధితోపాటు హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎంపీ బండి సంజయ్ ఏం అభివృద్ధి చేశాడో చెప్పిన తర్వాతే యాత్రలకు రావాలని డిమాండ్ చేశారు. ఐదేండ్లపాటు నియోజకవర్గాన్ని పట్టించుకోని సంజయ్ హుస్నాబాద్ ప్రాంతానికి వచ్చి మళ్లీ ప్రజలను మభ్యపెట్టే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడి ప్రజలను ఓటు అడిగే హక్కు బండికి లేదన్నారు. గ్యాస్‌పై ప్రభుత్వం ఇస్తున్న రూ.500 సబ్సిడీని కేంద్రం నుంచి ఇప్పించే దమ్ము బండి సంజయ్‌కి ఉందా అని ప్రశ్నించారు. బండి సంజయ్ హుస్నాబాద్‌కు ఏం చేశాడో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గానీ, మల్లె చెట్టు చౌరస్తాలో గానీ బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని, ఇందుకు ఆయన సిద్ధంగా ఉంటాడా అనేది చెప్పాలన్నారు. రాముడి మందిరం, అక్షింతలు అంటూ ఓట్లు అడగడం అప్రజాస్వామికమన్నారు. అధికారంలోకి వచ్చిన 48గంటల్లోపే రెండు గ్యారెంటీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేన్నారు. మరో రెండు గ్యారెంటీలను చేవెళ్లలో జరిగే సభలో ప్రియాంకగాంధీ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలకు మంగళవారం శ్రీకారం చుడుతామని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు వివిధ రంగాల్లో ఉపాధి పొందుతున్నారన్నారు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రారంభించిన పొద్దు తిరుగుడు పంట కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్ పర్సన్ అయిలేని అనితారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు, మార్కెటింగ్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

హుస్నాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో తడి, పొడి చెత్త బుట్టల పంపిణీ అనంతరం జరిగిన బడ్జెట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ ఆదాయాన్ని పెంచుకోవడం ద్వారా వేతనాలు తదితర అవసరాలకు నిధులు ఖర్చు చేసుకోవాలని సూచించారు. కౌన్సిల్‌లో తీర్మానం చేసుకొని నీటి బిల్లులు, ఇండ్ల అనుమతుల ఫీజులు, ఇతర పన్నులు వసూలు చేసుకోవాలన్నారు. ఇండ్ల అనుమతుల్లో కటాఫ్ డేట్ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తామని చెప్పారు. ప్రతి సంవత్సరం వానకాలంలో వరద నీటితో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున ఇప్పటికే అధికారులతో సమీక్ష నిర్వహించి వరద పట్టణంలోకి రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. పట్టణంలోని ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినట్లైతే వెంటనే వాటిని స్వాధీనం చేసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అక్రమ కట్టడాలపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం, హరితహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. మున్సిపల్ భవనాన్ని కూడా త్వరలోనే పూర్తి చేయిస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరుపై కూడా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదని, త్వరలోనే ప్రతి నియోజకవర్గానికి 3వేల ఇండ్లు మంజూరు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్ పర్సన్ అయిలేని అనితారెడ్డి, కమిషనర్ మలికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హుస్నాబాద్ మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మెదక్ రైల్వే స్టేషన్‌లో అమృత భారత్ స్టేషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మెదక్ కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

రైల్వే ప్రయాణం మరింత సౌకర్యవంతం

మెదక్ రైల్వేస్టేషన్ అమృత్ భారత్‌స్టేషన్‌కు ఎంపిక కావడం శుభపరిణామం

మెదక్ కలెక్టర్ రాజర్షి షా

మరిన్నిసదుపాయాలు కల్పించాలి

ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

వర్చువల్‌గా రూ.16 కోట్ల పనులు ప్రారంభించిన ప్రధానిమోదీ

మాసాయిపేట మండలం రామంతాపూర్ వద్ద ఆర్‌యూబీకి శంకుస్థాపన

మెదక్, (నమస్తే తెలంగాణ)/ వెల్దుర్తి, ఫిబ్రవరి 26 : అమృత్ భారత్ స్టేషన్ పథకంలో మెదక్ రైల్వే స్టేషన్ ఎంపిక కావడం శుభపరిణామమని మెదక్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ స్టేషన్ ఆధునీకరణ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. మెదక్ కలెక్టర్ రాజర్షి షా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మెదక్ రైల్వే స్టేషన్‌లో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు దాదాపు రూ.16 కోట్లు కేటాయించారని, దీంతో జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. వ్యవసాయం, పారిశ్రామిక, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, సుదూర ప్రాంతాలకు ప్రయాణించే వారికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వికసిత భారత్ కార్యక్రమంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

మరిన్ని సదుపాయాలు కల్పిస్తే అభివృద్ధి

– ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్ ప్రజల దశాబ్దాల కోరిక మెదక్ రైల్వేస్టేషన్ అని, ఇందు కోసం మెదక్ రైల్వే సాధన సమితి నాయకులతో పాటు ఎంతోమంది ఎన్నో రకాలుగా శ్రమించారని, వారి కృషిని ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నామని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రరెడ్డి అన్నారు. అమృత్ భారత్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మెదక్ స్టేషన్ ఆధునీకరణ కోసం రూ.15 కోట్లు కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. మెదక్ రైల్వేస్టేషన్ మరింత అభివృద్ధి చెందాలంటే మెదక్ నుంచి మనోహరాబాద్ వరకు రైలు మార్గం వేయాలన్నారు. భవిష్యత్తులో మనోహరాబాద్ రైల్వే జంక్షన్‌గా ఏర్పడే అవకాశం ఉన్నందున హైదరాబాద్ నుంచి సమీప పట్టణ ప్రాంతాలకు పుష్ పుల్ రైళ్లు నడిపించి, మెదక్ అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఎమ్మెల్సీ రైల్వే అధికారులను కోరారు. ఈ ప్రతిపాదిత మార్గం ద్వారా హైదరాబాద్ నుంచి నిజామాబాద్–నాందేడ్‌కు దూరంతో పాటు ప్రయాణ సమయం తగ్గుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే సర్వే పూర్తయిన మెదక్ – పటాన్‌చెరు (వట్టినాగులపల్లి) వయా జోగిపేట సంగారెడ్డి రైల్వేలైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్సీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, సీనియర్ డీఈ శ్రీతేజ, అధికారులు రహమా, రాజు, ఏఎంవీఎల్ నర్సింహారావు, వినయ్, మెదక్ స్టేషన్ సూపరింటెండెంట్ రమేశ్, స్టేషన్‌మాస్టర్లు పద్మారావు, నవనీత్, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

రైల్వే అండర్‌బ్రిడ్జికి శంకుస్థాపన

మాసాయిపేట మండల పరిధిలోని రామంతాపూర్, మనోహరాబాద్ మండలం కూచారం, పాలాటలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రైల్వేక్రాసింగ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వడియారం రైల్వేస్టేషన్ మాస్టర్ సయ్యద్‌గౌసోద్దీన్, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, బాలేశ్, రామస్వామి, సిద్దిరామ్‌లుతోపాటు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డిజిటల్ తెరపై నరేంద్రమోదీ శంకుస్థాపన కార్యక్రమాన్ని తిలకించారు.

సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

రేపటి నుంచి మార్చి 19 వరకు పరీక్షలు

సిద్దిపేట జిల్లాలో పరీక్ష రాయనున్న 20,949 మంది విద్యార్థులు

ఫస్టియర్‌లో 9,831, సెకండియర్‌లో 11,118 మంది

జిల్లా వ్యాప్తంగా 44 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు..

144 సెక్షన్ అమలు..

అమలులో ఒక నిమిషం నిబంధన

సీసీ కెమెరాల పర్యవేక్షణలో క్వశ్చన్ పేపర్ రిలీజ్

విద్యార్థుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

సిద్దిపేట జిల్లాలో ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థుల సౌకర్యార్థం జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సమస్యలు, సందేహాలు ఉంటే కంట్రోల్ రూమ్ సెల్: 9985128599, 99493 30191 నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సూర్యప్రకాశ్ తెలిపారు. సెంటర్ లోకేటెడ్ యాప్ ద్వారా విద్యార్థులు పరీక్షా కేంద్రం చిరునామా తెలుసుకోవచ్చన్నారు.

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 26: రేపటి నుంచి ప్రారంభం కాను న్న ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పా ట్లు పూర్తి చేశారు. పరీక్షలు మార్చి 19 వరకు కొనసాగనున్నాయి. సిద్దిపేట జిల్లాలో 44 పరీక్షా కేం ద్రాలు ఏర్పాటు చేయగా.. మొత్తం 20,949 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఏదైనా సందేహాలు నివృత్తి చేసుకోవాలంటే జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయం లో కంట్రోల్ రూమ్‌ను సైతం ఏర్పాటు చేశారు. ఉదయం తొ మ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. ఒక నిమిషం నిబంధన అమలులో ఉన్నందున విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని అధికారులు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని అధికారులు సూచిస్తున్నారు.

20,949 మంది విద్యార్థులు..

ఇంటర్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశా రు. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 44 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా.. మొత్తం 20,949 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో జనరల్ విద్యార్థులు 15,553 మంది, 5,396 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. 9,831 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు ఉండగా.. ఇందులో 7,441 మంది జనరల్ విద్యార్థులు, 2,390 మం ది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నా రు. 11,118 మంది ఇంటర్ సెకండియర్ విద్యార్థులు ఉండ గా.. ఇందులో 8,112 మంది జనరల్ విద్యార్థులు, 3,006 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. మొత్తం 44 పరీక్షా కేంద్రాల్లో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 15 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, మరో తొమ్మిది ప్రభుత్వ అనుబంధ కళాశాలలున్నాయి.

పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు విద్య, వై ద్య, రెవెన్యూ, పోలీస్, విద్యు త్, ఆర్టీసీ, పోస్టల్‌శాఖల అధికారులతో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఇప్పటికే సమీక్షా స మావేశం నిర్వహించి వారికి త గు సూచనలు చేశారు. 44 పరీ క్ష కేంద్రాలకు 44 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 44 మం ది డిపార్ట్‌మెంటల్ అధికారులు ఉంటారు. సిట్టింగ్ స్క్వాడ్, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ లు నియమించడంతో పాటు అడిషనల్ సూపరింటెండెంట్లు, రూట్ ఆఫీసర్లు విధులు నిర్వహిస్తారు. జిల్లాలో మొత్తం 17 స్టోరేజీ పాయింట్లు ఏర్పాటు చేశారు. పారదర్శకంగా పరీక్ష లు నిర్వహించేందుకు ప్రతి ప రీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఉండేటట్లు ఏర్పాటు చేసి.. సీసీ కెమెరా పర్యవేక్షణలోనే క్వశ్చన్ పేపర్‌ను రిలీజ్ చేయనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్ష న్ అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఏఎన్ఎంలు, ప్రా థమిక చికిత్సకు అవసమయ్యే మెడిసిన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీటని అందుబాటులో ఉంచనున్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

ఒక నిమిషం నిబంధన అమలులో ఉన్నందున విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో, ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశాం. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే ఇంటర్మీడియట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్లకు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.

– సూర్యప్రకాశ్, సిద్దిపేట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

○ మెదక్ జిల్లాలో 67,962 మంది చిన్నారులు ○ కలెక్టర్ రాజర్షి షా

మెదక్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): వచ్చేనెల 3,4,5 తేదీల్లో నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మెదక్ కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో పల్స్ పోలియో నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 157 ఆరోగ్య ఉపకేంద్రాలు, 1,74,534 నివాస గృహాలు, 25 ట్రాన్సిట్ పాయింట్లు, 176 హైరిస్క్ కేంద్రాలు, 523 పోలియో బూ త్ కేంద్రాలు, 1046 టీమ్‌ల ద్వారా 53 రూ ట్లలో 2332 వ్యాక్సినేటర్లతో కార్యక్రమం ని ర్వహించాలని పేర్కొన్నారు. జిల్లాలో 67,962 మంది చిన్నారులు ఉన్నారని, అప్పు డే పుట్టిన పిల్లల నుంచి 5 ఏండ్ల లోపు వయసున్న వారందరికీ పోలియో చుక్కలు వేయాలని తెలిపారు. మార్చి 3వ ఆదివారం పోలియో బూత్ కేంద్రాల్లో, మార్చి 4, 5 తేదీల్లో మిగిలిన పిల్లలందరికీ ఇంటింటికీ తిరిగి చుక్కలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్వలెన్స్ అధికారి డాక్టర్ మురారి రాజేంద్రప్రసాద్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి చందూ నాయక్, జిల్లా విద్యాధికారి రాధాకిషన్, డీడబ్ల్యూవో బ్రహ్మాజీ, జిల్లా యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగరాజు, ఆర్టీసీ డిపో మేనేజర్ సుధ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాజర్షి షా

బెదిరింపులతో అవిశ్వాసం నెగ్గలేరు

కాంగ్రెస్‌ది అప్రజాస్వామిక రాజకీయం

ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్

తూప్రాన్, ఫిబ్రవరి 26: మున్సిపల్ కౌన్సిలర్లను భయభ్రాంతులకు గురిచేసి, తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్ గౌడ్‌పై ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన కొందరు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం హేయమైన చర్య అని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. అవిశ్వాసానికి మద్దతు తెలుపాలంటూ పలువురు కౌన్సిలర్లను దాడులు, కేసులతో బెదిరిస్తున్నారని తెలుసుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు సోమవారం వారు తూప్రాన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తూప్రాన్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు అవసరమైన కోరం సరిపోకపోవడంతో 2వ వార్డు కౌన్సిలర్ మామిడి వెంకటేశ్‌ను బలవంతంగా కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారని ఎద్దేవా చేశారు. అతడు తిరిగి బీఆర్ఎస్‌లోకి రాగా, కొందరు కాంగ్రెస్, బీజేపీ నాయకులు అతడిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, ఇంటిని కూల్చివేస్తామని కమిషనర్ ద్వారా నోటీసులు పంపడంతో పాటు వృద్ధులైన వెంకటేశ్ తల్లిదండ్రులు, భార్య, పిల్లలను వేధిస్తున్నారని తెలిపారు. 8వ వార్డు కౌన్సిలర్ లావణ్యా దుర్గారెడ్డికి చెందిన ఇటుక బట్టీలను కూల్చడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నదని, దాడులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం కౌన్సిలర్ మామిడి వెంకటేశ్ కుటుంబాన్ని, ధ్వంసం చేసిన లావణ్యా దుర్గారెడ్డికి చెందిన ఇటుక బట్టీలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఏర్పుల లక్షణ్, పార్టీ మండల అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, గజ్వేల్ జడ్పీటీసీ మల్లేశం, మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, నాయకులు దుర్గారెడ్డి, సత్యలింగం, వెంకట్ గౌడ్, గంగాధర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఫార్మా విలేజ్ కోసం హక్కీంపేట గ్రామ శివారులో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అధికారులు

ఫార్మా విలేజ్ కోసం భూముల పరిశీలన

వెల్దుర్తి, ఫిబ్రవరి 26: ఫార్మా విలేజ్ కోసం మాసాయిపేట మండలంలోని పలు గ్రామాల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను మెదక్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. రామంతాపూర్ పరిధిలో 324, అచ్చంపేటలో 430.25, హక్కీంపేటలో 162.14 ఎకరాలను గుర్తించిన మండల రెవెన్యూ అధికారులు, జిల్లా అధికారులకు నివేదికలు సమర్పించడంతో సోమవారం తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, భూగర్భ వనరుల శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, టీఎస్ఐఐసీ శాఖల అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ భూములకు దగ్గరగా ఉన్న హల్దీ ప్రాజెక్టును సైతం సందర్శించి, భవిష్యత్తులో ప్రాజెక్టుకు ఏమైనా ఇబ్బందులు వస్తాయా అని చర్చించారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు మాసాయిపేట మండలంలో ఉన్న భూములను పరిశీలించామని, మరి కొన్ని ప్రాంతాల్లో ఉన్న స్థలాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్ఞానజ్యోతి, ఆర్ఐ ధన్‌సింగ్, సర్వేయర్ నర్సింహులు, సిబ్బంది ఉన్నారు.

190 కిలోల గంజాయి స్వాధీనం

రెండు కార్లు సీజ్..

ఐదుగురు నిందితుల అరెస్ట్

వివరాలు వెల్లడించిన సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్

గంజాయితోపాటు నిందితులను చూపిస్తున్న పోలీసులు

సంగారెడ్డి, ఫిబ్రవరి 26: అక్రమంగా రవాణా చేస్తున్న సుమారు రూ. కోటి విలువ గల 190 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని రెండు కార్లు సీజ్ చేసి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ సోమవారం విలేకరులకు వెల్లడించారు. మధ్యాహ్నం 12.30గంటల సమయంలో పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, రెండు కార్లలో తరలిస్తున్న 190 కిలోల ఎండు గంజాయిని గుర్తించారని తెలిపారు. రెండు కార్లలో ఐదుగురు ప్రయాణిస్తుండగా వీరిలో సతీశ్, గణేశ్ 150కిలోల గంజాయిని బీదర్‌లో ఉన్న జియా, షబ్బీర్లకు అమ్మడానికి వెళ్తున్నారని, మరో కారులో అహ్మద్ మొహ్మద్ ఆలం 40కిలోల గంజాయిని ముంబయిలో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. వీరితోపాటు ముంబయికి చెందిన సచిన్‌యాదవ్, షహీద్ మునీర్ షేక్ గంజాయిని అమ్ముతున్నారు. గంజాయి పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ శివలింగం, మహేశ్‌గౌడ్, ఎస్ఐ సాయిలు, హెచ్‌సీలు ఇస్మాయిల్, శంకర్, రేఖ్యానాయక్, గౌరీలతో పాటు అన్వర్, శశిధర్, నెల్లూర్, శ్రీహరి, నర్సింహులు, హరి, అరవింద్‌లను ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.